మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ప్రయాణీకులకు వాటర్ బాటిల్స్ అందజేసిన మంత్రి పొన్నం

గజ్వేల్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త): సిద్దిపేట జిల్లా కొడకండ్ల వద్ద బస్సు ఫెయిల్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులకు హైద్రాబాద్ నుండి సిద్దిపేట వైపు వెళ్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గమనించి అక్కడ ఆగి ప్రయాణీకులతో మాట్లాడి ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో తన కాన్వాయ్ నుండి వాటర్ బాటిల్స్ తీసి ప్రయాణీకు లకు అందించారు. బస్సు త్వరగా రిపేర్ చేయించి మరో బస్సు వచ్చే వరకు అక్కడే ఉండి ప్రయాణీకులను బస్సు ఎక్కించారు. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రయాణీకులు కృతజ్ఞతలు తెలిపారు.


బస్సు డ్రైవర్‌తో మాట్లాడుతున్న మంత్రి

## తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

సిర్గాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆర్‌డిఓ అశోక చక్రవర్తి తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను ఆర్‌డిఓ పరిశీలించి తహసీల్దార్ అబ్దుల్‌నజీమ్ ఖాన్‌తో సమీక్షించారు. రెవెన్యూ రికార్డుల్లో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఆర్‌డిఓ


భూభారతి అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ క్రాంతి

## త్వరగా సాదా బైనామాల పరిష్కారం
### -సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: భూభారతి చట్టంతో సాదా బైనామాలు త్వరగా పరిష్కారం అవుతాయని, భూ సరిహద్దులు పక్కాగా ఉంటాయని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం కందిలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సును కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులోఉంటుందన్నారు. భూ వివాదాల పరిష్కారానికి భూ భారతి దోహదంచేస్తుందన్నారు. భూలబ్దిదారుల సమస్యలపై కలెక్టర్ నివృతి చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆర్‌డిఓ రవీందర్‌రెడ్డి, రైతులు, రైతు సంఘాల నాయకులు, రెవిన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి...

కంది, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. బుధవారం కందిలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన అదనపు గదులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హత కలిగిన ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తారని, విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు అందచేస్తారని గుర్తు చేశారు. 2025-26 విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరిగేలాచేయాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: మండలకేంద్రం మాసాయిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సందర్శించారు పాఠశాలల్లోని వంట గదిలో వాష్‌రూమ్‌లను పరిశుభ్రత పరిశీలించారు. అలాగే స్టోర్ రూమ్‌ను, స్టోర్ రిజిస్టర్‌లను పరిశీలించి సరుకుల సరఫరాలో ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం పథకం నిర్వహించారు 9వ తరగతి విద్యా సమస్యలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు ప్రభుత్వ పాఠశాలలో విద్యనేర్పిస్తున్న విద్యార్థిని విద్యార్థుల విద్యార్థులకు క్వాలిటీ అందించేలా చూడడంతో విద్యకుప్రాధాన్యమిస్తుందని అన్నారు సమాజం బాగుపడుతుందని ప్రతి కుటుంబ పరిశుభ్రత విద్యార్థుల భద్రతపై దృష్టి సారించాలని ఆయన అన్నారు ప్రతిరోజు విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని సూచించారు.

## భూభారతితో రైతులకు సత్వర న్యాయం
### -జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి


మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

చౌటకూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: భూభారతి చట్టంతో రైతులకు సత్వర న్యాయం చేకూరుతుందని, భూభారతితో భూ రికార్డులు పటిష్టంగా ఉంటాయని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం చౌటకూరులో ఏర్పాటు చేసిన అవగాన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యలు త్వరగా సులభంగా పరిష్కరించబడతాయన్నారు. భూ రికార్డులో పేరు మార్పు, నూతన పౌతి లాంటివి 30 రోజుల్లో పరిష్కారం అవుతాయని ధరణిలో ఇలాంటి అవకాశం ఉండేది కాదన్నారు. భూసమస్యలను రెవెన్యూ కోర్టుద్వారానే పరిష్కారం అయ్యేలా చట్టంను రూపొందించారన్నారు. రైతుల సమస్యలకు రెవెన్యూ అధికారులు నివృతి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ పాండు, తహసీల్దార్ అనుదీప్, ఆత్మ కమిటి చైర్మన్ మల్లారెడ్డి, ఏఓ ప్రవీణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నత్తి దశరథ్, నాయకులు అందోల్ కృష్ణ, ఈశ్వర్ గౌడ్, వెంకటరెడ్డి, చక్రియాల ఆలయ కమిటి చైర్మన్ భానూరి లక్ష్మయ్య, రఘునాయక్, వసంత్‌గౌడ్, శివరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### వారసులను గుర్తించి ధృపత్రాలు అందచేస్తాం

కొండాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: చట్టపరమైన వారసులను గుర్తించి ధృవీకరణ పత్రాలు అందచేస్తామని దరఖాస్తుదారులకు తహ సీల్దార్ అశోక్ సూచించారు. బుధవారం తొగర్‌పల్లిలో విచారణ నిర్వహించారు.


ధరఖాస్తు దారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అశోక్

# భూభారతితో భూసమస్యలు పరిష్కారం
### రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త : భూ భారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం కోహెడలో నూతన ఆర్‌వోఆర్ చట్టంపై సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూములకు సంబంధించి చట్టంతో ఇబ్బందులు పడుతున్నామని లక్షలాది మంది ఫిర్యాదులు చేశారని, వారి సమస్యలను పరిష్కరించేందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతీ గ్రామంలో భూములకు సంబంధించిన సమాచారం గ్రామ రెవెన్యూ అధికారి వద్ద ఉండాలని 10 వేల పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. భూ హక్కుల లాగానే ఆధార్‌లా భూదార్ తీసుకొస్తున్నామన్నారు. నిజాం పాలన నుండి ఉన్న భూ చట్టాలలో దరిద్రమైన చట్టం ధరణి అని తెలిపారు. ఈ చట్టం ద్వారానే రాష్ట్రంలో భూ సమస్యలు వచ్చాయని వివరించారు. ప్రజాస్వామ్యంలో అందరం భాగస్వాములమేనని భూ సమస్యల మీద ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలన్నారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ప్రజావాణిలో ధరణి టైమ్‌లో మా భూములు వేరే వారి పేరుపై ఉన్నాయని ఫిర్యాదులు వచ్చేవని భూ భారతి ద్వారా అన్ని సమస్యలు పరిష్కరించవచ్చన్నారు. భూభారతి చట్టంపై ఈనెల 30 వరకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.

### సన్న బియ్యం చారిత్రాత్మక నిర్ణయం...

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం అని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం కోహెడలో సన్నబియ్యం లబ్ధిదారులైన తలారి చంద్రయ్య నివాసంలో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిన తర్వాత తమ కుటుంబాలకు ఎంతో లబ్ది జరుగుతుందని ప్రజలు అనుకుంటున్నారన్నారు. తాను భోజనం చేసిన తలారి చంద్రయ్య మల్లవ్వలది రేకుల షెడ్డు అని వారికి ఇందిరమ్మ ఇల్లు కావాలని అడిగారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇప్పించే ప్రయత్నం చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, నూతన రేషన్ కార్డులో, 200 యూనిట్ల విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన భోజనం, మెస్‌చార్జీలు,కాస్మోటిక్ చార్జీల పెంపు, ఉద్యోగ నియామకాలు, సన్నవడ్లకు రూ. 500 బోనస్‌తో పాటు మరిన్ని సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాంమూర్తి, తహసీల్దార్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

### ఉగ్రవాదుల దాడి బాదాకరం...

జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడి బాధాకరమైనదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉగ్రవాదుల దాడిపై కోహెడ పర్యటనలో స్పందించిన మంత్రి ఇటువంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా కఠినంగా వ్యవహరించాలన్నారు. దేశంలో వివిధ అంశాల మీద బేదాభిప్రాయాలు ఉంటాయి కానీ దేశ అంతర్గత భద్రతకు సంబంధించి అంతరూ ముక్తకంఠంతో ఏకాభిప్రాయంతో ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ అంశంలో కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సంతాపం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న మల్టీ జోన్ ఐజి సత్యనారాయణ

## మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు
### మల్టీజోన్ 2 ఐజిపి సత్యనారాయణ

సంగారెడ్డి బ్యూరో ఏప్రిల్ 23, ప్రభాతవార్త : మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, పోస్ట్‌లు పెట్టినా చట్టరీత్య కఠిన చర్యలు. తప్పవని మల్టీజోన్ 2 ఐజిపి పి.సత్యనారాయణ అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా, జిన్నారం గ్రామంలో శివారులో నిర్మాణంలో ఉన్న శివాలయం ఎదుట ఉన్న శివుని విగ్రహం ధ్వంసమైన విషయమై మంగళవారం సాయంత్రం జిన్నారం మండలంలో జరిగిన సంఘటనల పై జిల్లా ఉన్నత అధికారులతో దర్యాప్తు చేయించగా ఈ నెల 19 న సాయంత్రం 5.24 గంటల సమయంలో కొన్ని కోతులు వచ్చి శివుని విగ్రహం, గుట్ట పై నుండి కిందికి తోసి శివుని విగ్రహం ధ్వంసం చేసినట్లు విచారణలో తెలిసిందన్నారు. ఈనెల 22న సాయంత్రం గేమ్స్ ఆడుకొని శివాలయం నుండి వస్తున్న మదర్సా విద్యార్థులను చూసిన కొందరు స్థానికులు వారిని ప్రశ్నించిన అనంతరం శివాలయం వద్ద ధ్వంసమైన శివుని విగ్రహాన్ని చూసి, మదర్సా విద్యార్థులే ఈ పని చేసినట్లుగా భావించి, పూర్తి వాస్తవాలను తెలుసుకోకుండా కొంతమంది వ్యక్తులు పెద్దసంఖ్యలో వెళ్లి మదర్సాలో ఆస్థి నష్టం చేయడం జరిగిందని, వాస్తవాలను తెలుసుకోకుండా తప్పుడు ప్రచారాలు చేసి, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వాఖ్యలు చేస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే సహించేది లేదని, వారిపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఐజి చెప్పారు. గతంలో జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరిగాయని, 6 నెలల క్రితం సదాశివపేటలో ఓ గుడిలో ఆవులు ధ్వంసం చేస్తే, ఇదే విధంగా తప్పుడు ప్రచారం చేయడం జరిగిందని, విచారణలో వాస్తవాలు రాబట్టి సమస్యకు పరిష్కారం చూపడం జరిగిందని తెలిపారు. ప్రజలు మతసామరస్యం కలిగి ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాల్సిందిగా ఐజి సూచించారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, ఇలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు సమీప పోలీసు స్టేషన్ లో సమాచారం అందించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యల చేసినా, సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టినా చట్టరీత్య కఠిన చర్యలు ఉంటాయని ఐజి హెచ్చరించారు. సమస్యను జఠిలం కాకుండా త్వరగా స్పందించిన సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్‌పంకజ్, మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి, సంగారెడ్డి జిల్లా అధికారులను, సిబ్బందిని ఐజి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ పరితోష్‌పంకజ్, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## నూతన ఎఎంసి డైరెక్టర్లకు సన్మానం

మర్కుక్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త): వంటిమామిడి మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లుగా ఎన్నికైన పత్తి నర్సింలు, ర్యాకం యాదగిరి, శంకర్ గుప్తలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కనకయ్య గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్, తాజా మాజీ సర్పంచ్ తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, నర్సింలు, రవి తదితరులు పాల్గొన్నారు.


ఏఎంసి డైరెక్టర్లను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

# భూభారతి చట్టంతో భూములకు రక్షణ
### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




చిన్నశంకరంపేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: భూభారతి చట్టం రైతులకు భూములకు రక్షణ కవచంలా పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం చిన్న శంకరంపేట లోని రైతు వేదికలో భూభారతి ఆర్‌వోఆర్ చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్డిఓ రమాదేవి తహసీల్దార్ మనతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ భూభారతి చట్టం గురించి ప్రతి ఒక్క రైతుకు అవగాహన అవసరమన్నారు. భూ పరిపాలన వ్యవస్థ అనేక దశల్లో అభివృద్ధి చెందిందని అన్నారు. భూభారతి నూతన చట్టం ద్వారా రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించారని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు భూముల వివరాలను పూర్తిస్థాయిలో సర్వే చేస్తారన్నారు. సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించడంతో పాటు నిర్ణీత కాలంలో భూముల విరాసత్ చేసే అవకాశం కలుగుతుందన్నారు. పాసు పుస్తకాల్లో భూమి పటం, రెండెంచల అప్పీలు వ్యవస్థ ఏర్పాటుతో పాటు బూధార్ కార్డుల జారీ, ఇంటి స్థలాలకు ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు, భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్‌భూములకు ఎవరైనా పట్టాలు పొందితే రద్దు చేసే అవకాశం వంటి అంశాలను ఈ చట్టంలో పొందుపర్చారన్నారు.

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు భూభారతి పోర్టల్‌లో ఉన్న వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

### 'వార్త'కు స్పందన
## మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు

కంగ్టి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: మండల పరిధిలోని చౌకన్‌పల్లి గ్రామంలో నెలకొన్న నీటి కష్టాలను అధికారులు పరిష్కరించారు. ఈ నెల 18 ప్రభాతవార్త చౌకన్‌పల్లిలో తాగునీటి కష్టాలు శీర్షికతో గ్రామంలో నెలకొన్న తాగునీటి కష్టాలను వెలుగులోకి తెచ్చిన విషయం పాఠకులకు విధితమే. వార్త కథనానికి స్పందించిన అధికారులు మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మత్తులు చేపట్టి గ్రామంలోకి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. వార్త కథనానికి స్పందించి గ్రామంలోకి తాగునీరు సరఫరా అయ్యేల చేసిన అధికారులకు, సమస్యను వెలుగులోకి తెచ్చిన ప్రభాతవార్తకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.


మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

## ఝురాసంగంలో క్యాండిల్ ర్యాలీ

ఝురాసంగం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: కాశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడిని మానవత్వానికి మాయని మచ్చగా మిగిలిపోతుందని, ప్రతి భారతీయుడు ఉగ్ర దాడిని ఖండించాల్సిన అవసరం ఉందని హిందూ ధార్మిక సంఘం బాధ్యులు పేర్కొన్నారు. బుధవారం రాత్రికి ఝురాసంగం పట్టణంలో ఉగ్ర దాడిని నిరసిస్తూ హిందూ ధార్మిక సంఘ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో హిందూ ధార్మిక సంఘ బాధ్యులు క్రిష్ణ, రాజేందర్‌సింగ్, శ్రీనివాస్, నాగన్న, సంగమేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, వీరేశం, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


ఝురాసంగంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## భార్య అనుమానిస్తుందని భర్త ఆత్మహత్య

పాపన్నపేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: భార్య అనుమానిస్తోందని భర్త పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొడుపాకలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ సంగయ్య కథనం ప్రకారం... గ్రామానికి చెందిన అవుసుల శ్రీకాంత్(24) కుల వృత్తి చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడన్నారు. నార్సింగిలో కులవృత్తి దుకాణం నిర్వహిస్తూ నిత్యం దుకాణానికి వెళ్లి పనులు ముగించుకుని వస్తున్న భర్తతో భార్య ఆడవారితో ఎక్కువగా మాట్లాడుతున్నావని భార్య లావణ్య తరుచూ గొడవకు దిగుతుండటంతో తన వృత్తి ఆడవారికి నగలు చేయడమే అని ఆడవారితో మాట్లాడక తప్పదని, తప్పుగా భావించవద్దని భర్త భార్యకు పలుమార్లు నచ్చచెప్పినా ప్రయోజనం లేకపోవడంతో ఈ నెల 21న శ్రీకాంత్ సోమవారంరాత్రి పెట్రోలు పోసుకుని ఆత్మహత్య యత్నం చేశాడన్నారు. చికిత్స నిమిత్తం శ్రీకాంత్‌ను మెదక్‌లోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో హైద్రాబాద్‌లోని కొంపల్లిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ బుధవారం ఉదయం కానరాని లోకాలకు చేరిపోయాడన్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ సంగయ్య వివరించారు.

## అడవి పంది దాడి... వృద్ధుడికి తీవ్ర గాయాలు


గాయపడిన నాగయ్యను 108 వాహనంలో తరలిస్తున్న సిబ్బంది

చేర్యాల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త : అడవి పంది దాడిలో వృద్ధుడికి తీవ్రగాయాలైన సంఘటన వీరన్నపేట గ్రామంలో చోటుచేసుకుంది. వీరన్నపేట గ్రామానికి చెందిన సూర్న నాగయ్య(66) గ్రామ శివారులో గొర్లను మేపుతున్న క్రమంలో చెట్ల పొదల్లో నుండి వచ్చిన అడవి పంది ఒక్కసారిగా దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. ఇది గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది నవీన్, లక్ష్మణ్ తాత్కాలిక వైద్యం నిర్వహించి, చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తీవ్రగాయాలయ్యాయని వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కొరకు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర సమయంలో స్పందించిన సిబ్బందిని గ్రామస్థులు అభినందించారు.

# భూభారతి చట్టంతో కోర్టుకు అప్పీల్ చేసుకోవచ్చు
### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు వెళ్లాల్సి ఉండేదని నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని సిద్దిపేటజిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో బుధవారం రైతువేదికలో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి మాట్లాడారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్‌వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూమి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకోవచ్చునని తెలిపారు. అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్డుకు వెళ్లవచ్చునని.. దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందన్నారు. వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసీల్దార్ విచారణ జరిపి హక్కుల రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని నిర్ణీత గడువులోగా చేయకుంటే అటోమెటిక్‌గా మ్యూటేషన్ జరుగుతుందన్నారు. అంతకుముందు జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను రైతులకు, ప్రజలకు పవన్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అవగాహన సదస్సులో ఆర్డీఓ సదానందం, జడ్పీ సీఈవో రమేష్, తహసీల్దార్ వెంకటేష్, ఆర్టీఏసభ్యులు డాక్టరన లక్కరసు సూర్యచంద్రవర్మ, మండల రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఎంఐఎం విజయం లాంఛనమే..!

- ముగిసిన లోకల్‌బాడీ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్
- ఓటేసిన బిజెపి,ఎంఐఎం,కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు
- మొత్తం 112 ఓట్లలో 88 ఓట్లు పోలింగ్
- గెలుపుకు కావాల్సింది 45...ఎంఐఎంకి 50పైచిలుకు ఓట్లు




**హైదరాబాద్, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ స్థానానికి బుధవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యుల కోసం వేర్వేరుగా ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్ లలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈఎన్నికల్లో బిఆర్ఎస్ సభ్యులు పోలింగ్‌కు దూరంగా ఉండగా బిజెపి,ఎంఐఎం,కాంగ్రెస్ సభ్యులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 112 మంది ఓటర్లు ఉంటే 88ఓట్లు పోలయ్యాయి. దీంతో ఇందులో సగానికంటే ఒకటి ఎక్కు వచ్చిన వారిని విజేతగా ప్రకటించనున్నారు. పోలైన ఓట్లలో అత్యధికంగా 50 మంది ఓటర్లు ఎంఐఎం పార్టీకి చెందిన వారే ఉండగా, వీరంతా మూకుమ్మడిగా కలిసి రెండు బూత్ లలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీకి చెందిన 24 మంది ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉండగా..కాంగ్రెస్‌కు చెందిన 14మంది, బిజెపి నుంచి 24మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే పోలైన ఓట్లలో సగం కంటే ఎక్కువ అంటే దాదాపు 50 పై చిలుకు ఓట్లు మజ్లీస్ పార్టీకి అనుకూలంగా ఉండటంతో ఈఎలక్షన్‌లో ఎంఐఎం విజయం లాంఛనమేనని తేలిపోయింది.

**పోలింగ్ సాగిందిలా...**

ఉదయం ఎనిమిది గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బూత్ నెంబర్1లో తన ఓటుహక్కు వినియోగించుకున్నారు.అలాగే ఎంపిలు ఈటెల రాజేందర్, డా. కే. లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ తర్వాత ఎంఐఎం హైదరాబాద్ ఎంపీ అసదుద్దిన్ ఓవైసీ ఎమ్మెల్యేలు అక్బరుద్దిన్ ఓవైసీ, మాజీద్ హుస్సేన్, కౌసర్ మోహియుద్దిన్, ముంతాజ్ ఖాన్, మిరాజ్ జాఫర్ హుస్సేన్, మహ్మద్ ముబిన్, అహ్మద్ బిలాలాలు ఒకే సారి వరుసగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికార కాంగ్రేస్ పార్టీకి చెందిన ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ప్రస్తుత లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్ లతో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ , మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డిలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే తెలంగాణ జన సమితి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఓటు వేశారు. మధ్యాహ్నం కల్లా ఎంఐఎం పార్టీకి చెందిన కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఈస్థానానికి బీజేపీ అభ్యర్థిని బరిలో నిలిపినపుడు విముఖంగా మాట్లాడిన గోషామహాల్ బీజేపీ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ సైతం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు ఓటింగ్ కు దూరంగా ఉన్నా.. మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో పలువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వస్తున్నారంటూ ప్రచారం జరిగింది. ఆతర్వాత ఎవరూ రాకపోవడంతో మొత్తం 88ఓట్లు పోలైనట్లు అధికారులు ప్రకటించారు. జీహెచ్ఎంసీ పాలక మండలిలో అత్యధికంగా 50 ఓట్ల వరకు ఎంఐఎం పార్టీకి చెందిన ఓట్లు పోల్ కావటంతో మజ్లీస్ పార్టీ అభ్యర్థికి విజయం పట్ల కాన్ఫిడెన్స్ పెరిగింది.

**కాంగ్రెస్-బిఆర్ఎస్ నాటకాలు బయటపడ్డాయి**

**: బిజెపి అభ్యర్థి గౌతంరావు**

హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ , బీఆర్ఎస్ నాటకాలు బయటపడ్డాయని బిజెపి అభ్యర్థి గౌతంరావు విమర్శించారు. పోలింగ్ ముగిసిన అనంతరం మాజీ ఎంఎల్‌సి రాంచందర్‌రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ " బీఆర్ఎస్ ఎన్నికలను బహిష్కరించి పరోక్షంగా ఎంఐఎంకి మద్దఇచ్చింది. అలాగే అధికార కాంగ్రెస్ మజ్లిస్‌కు మద్దతు తెలిపి ఎంఐఎంకు తొత్తుగా మారింది. హైదరాబాద్ రాబోయే రోజుల్లో ప్రశాంతంగా ఉండాలంటే నగర ప్రజలకు బీజేపీకి మద్దతుగా ఉండాలి ఈ ఎన్నికల్లో మా పార్టీ సభ్యులంతా మద్దతు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు మాకు ఓటు వేశారు 25న జరిగే కౌంటింగ్‌లో నేను గెలుస్తాను "అని గౌతంరావు పేర్కొన్నారు.

## రోబోటిక్ పరికరంతో మురుగుకు చెక్

**-సీవర్ క్రోక్ పనితీరును పరిశీలించిన హైడ్రా, జిహెచ్ఎంసి కమిషనర్లు**



సచివాలయం ముందున్న డ్రైన్‌లో సీవర్‌క్రోక్ పనితీరు పరిశీలిస్తున్న కమిషనర్లు రంగనాథ్, ఇలంబర్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** మురుగు నీటి పైపు లైన్లలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించే సీవర్ క్రోక్ రోబోటిక్ పరికరం పనితీరును హైడ్రా, జీహెచ్ ఎంసీ కమిషనర్లు ఏవీ రంగనాథ్ , ఇలంబర్తి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోబోటిక్, వాటర్‌జెట్ శక్తితో నడిచే ఈ పరికరం సిల్ట్‌ను తొలగించే విధానాన్ని గమనించారు. సచివాలయం ముందు ఉన్న డ్రైన్లలో ప్రయోగాత్మకంగా పరీక్షించారు. మురుగు, వరద నీరు పొంగి రహదారులను ముంచెత్తడం నగరంలో సర్వ సాధారణమైన పరిస్థితుల్లో సీవర్ క్రోక్ ఎంతవరకు ఉపయోగపడుతుందనేది ఇరువురు కమిషనర్లు పరిశీలించారు. వాటర్ జెట్‌తో టర్బైన్‌ను తిప్పడంతో ముందుకు వెళ్లి బ్లేడ్ల సాయంతో చెత్తను తొలగించే విధానం, మ్యాన్‌హోల్‌లో మనుషులు దిగాల్సిన పని లేకుండా చెత్తను తొలగించే తీరును పరిశీలించారు. మురుగు ముప్పున్న ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుని అక్కడ ఈ విధానాన్ని అమలు చేయాలని ఇరువురు కమిషనర్లు నిర్ణయించారు.

## బతుకమ్మ కుంటలోనే బతుకమ్మ ఉత్సవాలు

**-అభివృద్ధి పనులను ప్రారంభించిన హైడ్రా కమిషనర్**



చెరువు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** వచ్చే బతుకమ్మ ఉత్సవాల నాటికి బతుకమ్మ కుంటను సిద్ధం చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. బతుకమ్మ కుంటలు సంబంధించిన కోర్టు వివాదం పరిష్కారమయ్యిందన్న ఆయన బుధవారం అంబర్ పేటలోని బతుక మ్మ కుంటను సందర్శించారు. స్థానికుల సమక్షంలో బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. యుద్ధ ప్రాతిపదికన ఈ చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ చెరువును పునరుద్ధరిస్తే పరిసరాలన్నీ ఆహ్లాదకరంగా మారుతాయని పనులకు సహకరించాలని స్థానికులను కోరారు. ఈ కార్యక్రమానికి స్థానికులు పెద్దయెత్తున హాజరై అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తామని స్థానికులు కమిషనర్‌కు హామీ ఇచ్చారు.

## మైనర్ల డ్రైవింగ్‌లపై 1275 కేసులు...35వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దు

**హైదరాబాద్,ఏప్రిల్23,ప్రభాతవార్త:** మైనర్ల డ్రైవింగ్‌లపై నగర ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝూలిపిస్తుంది. ఈ నెల మొదటి వారంలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో 1275 కేసులు నమోదు చేసినట్లు బుధవారం నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్‌డేవిస్ తెలిపారు. నగర పరిధిలో తనిఖీలు చేపట్టి మైనర్ల డ్రైవింగ్‌లను కట్టడి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. 35 వాహనాల రిజిస్ట్రేషన్లను ఏడాదిపాటు రద్దు చేశామని పేర్కొన్నారు. పిల్లలకు బైక్‌లు, కార్లను ఇవ్వడాన్ని మానుకోవాలని ఆయన సూచించారు. కనీస అవగాహన లేని వయస్సులో వాహనాలను ఇస్తే ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదని వెల్లడించారు. 25ఏళ్ల వయస్సు ఉన్న వారే డ్రైవింగ్ లైసన్స్‌కు అర్హులన్నారు.



జపాన్ పర్యటనను పూర్తి చేసుకొని నగరానికి వచ్చిన సిఎం రేవంత్ రెడ్డికి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, వీర్లపల్లి శంకర్,తదితరులు శాలువా కప్పి స్వాగతిస్తున్న దృశ్యం

## బట్టతలకు మందు ప్రచారం - తరలివచ్చిన ప్రజలు



బట్టతలపై జుట్టు మొలిపిస్తామని ప్రచారం చేయడంతో బారులు తీరిన స్థానికులు దృశ్యం.

**ఉప్పల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** బట్టతలపై జుట్టు మొలిపిస్తామని ఒక సంస్థ నిర్వహకులు ప్రచారం చేయడంతో రామంతాపూర్ భగాయత్‌కు భారీ ఎత్తున స్థానికులు తరలివచ్చారు. పాతబస్తీలో ఇటీవల బట్టతలకు మందు రాయడంతో మందు వికటించి పలువురు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇది మరిచిపోక ముందు బుధవారం రామంతాపూర్ భగాయత్‌లో సూర్యపేట జిల్లా రాజానాయక్ తండాకు చెందిన హరీష్ అనే వ్యక్తి బుధవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరి వద్ద నుంచి షాంపు కోసం 300, ఇతర వస్తువులకు రూ.700 వసూలు చేసినట్లు స్థానికులు తెలిపారు. ఒక్కొక్కరి వద్ద నుంచి సుమారు వెయ్యి వసూలు చేసినట్లు తెలిపారు. శాస్త్రీయంగా దీనికి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో కొందరు దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి నిర్వహకుడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనిని స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. శాస్త్రీయంగా అనుమతి లేని వాటిని నమ్మవద్దని పోలీసులు సూచించారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ..

**పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

తాళం వేసిన ఇంట్లో పట్ట పగలే చోరి జరిగిన సంఘటన పేట్ బషీరబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాయత్రి నగర్‌లోని ఫ్లాట్ నెంబర్ 401లో కెవి రాజ్ నివాసం ఉంటున్నాడు. ఎప్పటిలాగే ఈ నెల 21వ తేదీ ఉదయం సుమారు 7.30 గంటలకు తను ఉంటున్న ఫ్లాట్‌కు తాళం వేసుకుని ఆఫీస్‌కు వెళ్ళిపోయాడు. తిరిగి రాత్రి 8.30 గంటలకు ఇంటికి వచిచినచ చూడగా ఇంటికి వేసిన తాళం విరిగిపోయి ఉంది. లోపలికి వెళ్ళి చూడగా లాకర్ ఓపెన్ చేసి ఉంది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి సఉుమారు 21 తులాలు బంగారాన్ని దొంగతనం చేసినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## రసరమ్యం రమణీయం విదూషీ స్వప్నసుందరి అభినయం

**నాంపల్లి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :**

శృతి లయబద్ధమైన అద్భుత నాట్య విన్యాసం, రమణీయంగా రసర మ్యంగా ప్రఖ్యాత నాట్యాచారిణి పద్మభూషణ్ విదుషీ స్వప్నసుందరి వివిధ అంశాల నేత్రపర్వ నృత్య ప్రదర్శనకు నవ్యనాటక సమితి నిర్వహణలో తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రా మానుజరావు కళామందిరం వేదికైంది. ఈమేరకు ఆమె లాస్యలలిక అభినయ ప్రధాన నృత్యప్రదర్శన వీక్షకులను ఆద్యంతం రక్తికట్టించి ఎంతగానో అలరించింది. స్వప్న సుందరి ముందుగా పుష్పాంజలి అంశంతో తన నాట్యప్రదర్శనను ఆరంభించి పలువురు వాగ్గేయకా రుల తెలుగు రచనలను నాట్యప్రదర్శనతో మెప్పించారు. ముఖ్యంగా క్షేత్రయ్య పదం, సహాజీ పదం, స్వాతి తిరునాల్ జావళి, వల్లభాచార్య కవి మధురాష్టకం వంటి అద్భు త హావభావాలతో నర్తించి ప్రతీఒక్కరినీ రంజింపజేశారు. ఈ కార్యక్రమానికి ము ఖ్యఅతిథులుగా విశ్రాంత ఐఎఎస్ అధికారి ఆర్.వి.చంద్రవదన్, తెలంగాణ రాష్ట్ర ఖజానా లెక్కలశాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర, దేవాదాయశాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణి, సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, నృత్యగురువు సుధామాల, బాలాజీశర్మ తదితరులు విదుషీ స్వప్నసుందరిని ఘనంగా సత్కరించి ఎంత గానో అభినందించి ప్రసంగించారు. యువకళాకారులకు స్ఫూర్తిదాయకమం స్వప్నసుం దరి నృత్యప్రదర్శనని, అభినయం నాట్యానికి ఎంతో ముఖ్యమని, నృత్యప్రదర్శన రక్తిక ట్టాలంటే అభినయమే కీలకమని చంద్రవదన్ అన్నారు. నాట్యగురువులు ఇందిరాహేమ, మధుమతి కులకర్ణి, లక్ష్మీమానస, మాధవీమాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



**నాచారం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** నాచారం రవీంద్ర నగర్ లోని సాయిబాబా దేవాలయంలో నూత నంగాఏర్పాటు చేసిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బిఎల్ఆ ర్ స్థానిక కార్పొరేటర్ శాంతి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా నవగ్రహాల ప్రతిష్ట ప్రతిష్ట కార్య క్రమానికి వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ సందడి..!

**-ఉగ్రదాడి బాధితులకు నివాళి -మ్యాచ్‌లో నో చీర్ లీడర్స్**



**ఉప్పల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌తో స్టేడియం బయట కోలాహలం నెలకొంది. బుధవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన సన్‌రైజర్స్, ముంబయి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ కోసం సాయంత్రం 4 గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు స్టేడియం లోపలికి రావడం ప్రారంభించారు. రాత్రి 7.30 గంటలకు మ్యాచ్ ప్రారంభ సమయానికి ప్రేక్షకులు తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికి గంట తర్వాత పూర్తిస్థాయిలో నిండిపోయింది. స్టేడియం లోపల మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయగా, స్టేడియంలోకి వచ్చే దారులను పోలీసులు మూసివేసి టిక్కెట్లు ఉన్న వారినే లోపలికి అనుమతించారు. క్రీడాకారులు పెవిలియన్‌కు వచ్చే సమయంలో ఫోటోలు తీసేందుకు ప్రేక్షకులు పోటీ పడ్డారు. క్రికెట్ మ్యాచ్, శ్రీరామ నవమి సందర్భంగా పోలీసులు పట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఐపిఎల్ మ్యాచ్‌తో ఉప్పల్‌లో సందడి :** ఐపిఎల్ మ్యాచ్ చూసేందుకు ప్రేక్షకులు అధికంగా తరలిరావడంతో గ్యాలరీలు నిండిపోయాయి. అధికశాతం మంది కాంప్లిమెంటరీ పాసుల కోసమే తంటాలు పడ్డారు. కేవలం తక్కువ రేటు ఉన్న టిక్కెట్లకు మాత్రమే డిమాండ్ ఉండగా, అధిక రేట్లు ఉన్న టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపలేదు. అదే విధంగా పలువురు రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు కాంప్లమెంటరీ పాసులు పొంది తమ బందువులు, అనుయాయులకు ఇచ్చారు. మరోవైపు పోలీసులు, ఇతర అధికారులు మధ్యాహ్నం నుంచే బందోబ స్తులో ఉండడంతో రాత్రి వరకు నిరసించి పోయారు.

**ఉగ్రదాడి బాధితులకు నివాళి :** పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన బాధితులకు క్రీడాకారులు నివాళిఅర్పించారు. మ్యాచ్ ప్రారంభానికి ముందే స్టేడియంలో నివాళులు అర్పించారు. స్టేడియంలో ప్రేక్షకులు సైతం ఉగ్ర బాధితులకు మౌనం పాటించి నివాళులు అర్పించారు. క్రీడాకారులు నల్ల బ్యాడ్జీలు ధరించి బరిలోకి దిగారు. కాగా ఈ సంఘటనపై సన్‌రైజర్స్ యజమాన్యం కూడా స్పందించింది. పహల్గాం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేసినట్లు ప్రకటించారు. గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని సూచించారు

## హబ్సిగూడ నాచారం రోడ్డు వెడల్పు చేయించాలని కేంద్ర మంత్రికి వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** హబ్సిగూడ నుంచి నాచారం వెళ్లేరోడ్డు ప్రారంభంలో ఉన్న ఐఐసీటీ రోడ్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రోడ్డు వెడల్పు చేయించి ప్రజలకు ఇబ్బందులు తలెత్త కుంటా చూడాలని బుధవారం కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌కు ఎమ్మెల్యే బిఎల్ఆర్, స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నాచారం ప్రధాన రహదారిలో ఐఐసిటి ఇన్స్టిట్యూట్ క్వాటర్స్ వద్ద ఉన్న రోడ్డును వెడల్పు చేయాలని వారు కోరారు. నాచారంలో పలు స్కూల్స్ ఉండడం, చర్లపల్లి కొత్త రైల్వే స్టేషన్ కు వెళ్లే దారి కూడా ఇదే కావడం వల్ల నిత్యం ఈ ప్రధాన రహదారిపై వేలది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారని, ఎన్ఎఫ్‌సి, ఈసీఐఎల్ కంపెనీలకు వెళ్లేవారు కూడా ఇదే దారి గుండా వెళుతుంటారిని ఐఓసీఎల్, బిపిసిఎల్ కంపెనీల అనేక పెట్రోల్ డీజిల్ ట్యాంకర్లు ఇదే దారి గుండా వెళ్తుంటారని తెలియజేశారు. దీంతో హబ్సిగూడ నుంచి నాచారం వెళ్లే వారికి ఐఐసిటి కాంపౌండ్ వాల్ ప్రారంభమయ్యే వరకు సునాయాసంగా వచ్చిన ఐఐసిటి కాంపౌండ్ వాల్ నుండి హబ్సిగూడ వరకు వెళ్లడానికి కనీసం 15 నిమి షాలు పడుతుందని తెలిపారు. ఈ సమస్య పై కేంద్ర మంత్రి తప్పకుండా రోడ్డు వెడల్పుకు సహకరిస్తామని హామీ ఇస్తామని హామి ఇచ్చారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, ఐఐసిటి డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

**హైదరాబాద్, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** తెలంగాణలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అంబెడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం మూడవ రోజు కొనసాగింది. యూనివర్సిటీ ప్రాంగణంలోని అంబెడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. పలువురు రెగ్యులర్ అధ్యాపకులు, అధ్యాపకేతర సంఘాల నాయకులూ సంఘీభావం తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన చలో ఉస్మానియా కార్యక్రమానికి కూడా అంబెడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుండి పలువురు కాంట్రాక్టు అధ్యాపకులు తరలివెళ్లి మద్దతు పలికారు. అంబెడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘము అధ్యక్షుడు డా.కె. అవినాష్, ప్రధాన కార్యదర్శి డా.ఎం.కిషోర్ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని, ఆలోపు యూజీసీ పేస్కేల్ ఇస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో సలహాదారులు డా. కాసం విజయ్, ఉపాధ్యక్షులు కె. ఉమాదేవి, సంయుక్త కార్యదర్శి డా. పి. రాధాకృష్ణ, కోశాధికారి డా. వై. కుమార్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు డా. మఖ్దూం మోయుదుద్దిన్, డా. నాగిళ్ల రామకృష్ణ, కాంట్రాక్టు అధ్యాపకులు డా.విజయ ఉషశ్రీ , డా. సిద్ధాంతి అరుణ, డి. శ్రీవేణి, నర్సయ్య భట్టు, డా.కురుమేటి దయాకర్,బి. రాజా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులు, సహకరించిన నలుగురు అరెస్టు



**మలక్ పేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** తప్పుడు నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించుకుని మలక్ పేట సలీం నగర్‌లో అక్రమంగా నివాసముంటున్న ఇద్దరు బంగ్లా దేశీయులను, వారికి సహకరించిన మరో నలుగురిని సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, మలక్ పేట పోలీసులతో కలిసి అరెస్టు చేశారు. ఎస్సై సురేష్ కథనం ప్రకారం తప్పుడు నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించుకుని మూసారాంబాగ్ డివిజన్ లోని సలీంనగర్ లో ఇద్దరు బంగ్లాదేశీయులు అక్రమంగా నివాసముంటున్నారన్న విశ్వసనీయ సమాచారాన్ని అందుకున్న సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మలక్ పేట పోలీసులతో కలిసి మంగళవారం సలీం నగర్ లోని ఇంటిపై దాడులు నిర్వహించి ఇద్దరు బంగ్లాదేశీయులను అరెస్టు చేశారు. బంగ్లాదేశ్ మీర్ పూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ హసిబుల్ (23) జోవాన్ చౌదరి పేరుతో, బంగ్లాదేశ్ జెస్సోర్ జిల్లా బెనాపోల్ గ్రామానికి చెందిన రోహన్ సాహ (21) అలియాస్ రోహన్ ల పేర్లతో దేశంలోకి అక్రమంగా చొరబడి మూసారాంబాగ్ డివిజన్ లోని సలీం నగర్ లో నివాసం ఉంటున్నారు. బంగ్లాదేశ్ లోనే తప్పుడు ఆధార్ కార్డులను సృష్టించుకున్న వీరు, ఇక్కడకు వచ్చిన తర్వాత నల్గొండ చౌరస్తాలోని స్మోక్ అండ్ పాన్ షాప్ నిర్వాహకుడు, అక్బర్ బాగ్ కు చెందిన మహమ్మద్ ముఖిద్(39) ను కలిశారు. తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాన్ని ఇప్పించాలని కోరారు. దాంతో అతడు కాలాడేరా ప్రాంతానికి చెందిన డి ఆర్ పి ఆపరేటర్ తేమూర సాయికిరణ్(50) కు విషయాన్ని చెప్పగా అతడు, చంచల్ గూడ డైమండ్ హోటల్ ప్రాంతానికి చెందిన బ్రోకర్(ఆధార్ కార్డు, పాన్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు ఇప్పించే బ్రోకర్) గడ్డమీద రజినీకాంత్(46), నార్సింగ్ మున్సిపాలిటీలో శానిటేషన్ విభాగంలో ఔట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న దుద్దు సుధీర్ కుమార్ (27)సహాయంతో తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించుకొని ఏడాదిన్నర కాలంగా అక్రమంగా నివాసం ఉంటూ లేబర్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఉదయం మలక్ పేట పోలీసుల సహాయంతో దాడు లు నిర్వహించిన సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఇద్దరు బంగ్లాదేశీ యులతోపాటు వారికి తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించి ఇచ్చిన మరో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. వారి వద్ద నుంచి ఫేక్ ఆధార్ కార్డులు, ఒక సెల్ ఫోన్, ల్యాప్ టాప్ ను స్వాధీనం చేసుకున్నారు.


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## రజతోత్సవ సభను జయప్రదం చేయండి

**కొమురవెల్లి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ఈనెల 27వ తేదీన వరంగల్ లో నిర్వహించే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని పార్టీ సీనియర్నాయకులు ఏర్పుల మహేష్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే సభకు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి విభాగం, యువజన సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేయడంలో విఫలమైందని, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు ఈ సభలో తెలియజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంద శ్రీధర్, గొట్టె రవి, వెంకటేష్, వారట్బాబు, మహేందర్ యాదవ్, లింగంపల్లి అజయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : ఎంఈవో


మండల విద్యాశాఖ అధికారిని సత్కరిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాశాఖ అధికారి బండారి మనీల అన్నారు. బుధవారం మండలంలోని వంగ రామయ్యపల్లి గ్రామ పరిధిలోని పుల్నాయక్తండా ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో విద్యార్థులు ఆటపాటలతో అందరిని అలరించారు. అనంతరం ఎంఈవో మనీల మాట్లాడుతూ గ్రామంలో పనిచేసే ఉపాధ్యయులతో పాటు వారికి సహకరిస్తున్న గ్రామస్థులను ప్రశంసించారు. ప్రధానోపాధ్యాయులు శివ కుమార్ మాట్లాడుతూ తల్లితండ్రులు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తూ ఆర్థికంగా నష్టపోవద్దని, ప్రభుత్వ పాఠశాలలకు పంపించి వారి భవిష్యత్తుకు మంచి బాటలు వేయాలన్నారు. అనంతరం ఎంఈవోను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వెంటకరామిరెడ్డి, తిరుపతిరెడ్డి, రమేష్, సంపత్, తిరుపతి, రమేష్, శ్రీనివాస్, స్వామి, రవి, శంకర్, దేవి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవకు ఉపయోగపడాలి : ఎంఈవో


పదవి విరమణ పొందిన వెంకటరామిరెడ్డిని సత్కరిస్తున్న ఎంఈవో

**అక్కన్నపేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ప్రతి ఉద్యోగి పదవీ విరమణ అనంతరం సమాజ సేవకు ఉపయోగపడాలని అక్కన్నపేట మండల విద్యాశాఖ అధికారి గుగులోతు రంగానాయక్ అన్నారు. బుధవారం గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుడు ఎడబోయిన వెంకటరామిరెడ్డి పధవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్యోతి, రామవరం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం లింగాల శైలజ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట మున్సిపల్ పదవవార్డు కౌన్సిలర్ బింగి బాలలక్ష్మి అన్నారు. బుధవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వప్న ఆధ్వర్యంలో ఇంద్రనగర్ సెక్టార్ పరిధిలో నిర్వహించిన పోషన్ పక్వాడలో కౌన్సిలర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదుసంవత్సరాల లోపు పిల్లలను కచ్చితంగా తల్లితండ్రులు అంగన్వాడీ కేంద్రానికి పంపించాలన్నారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వప్న మాట్లాడుతూ గర్భం దాల్చిన ప్రతీ మహిళ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకుని అక్కడ అందంచే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, ఏఎన్ఎం జలజతో పాటు తదితరులు ఉన్నారు.

## పేదలకు వరం సిఎం సహాయనిధి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** సిఎం సహాయనిధి పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జీ పూజల హరికృష్ణ అన్నారు. బుధవారం చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామానికి చెందిన మల్లారెడ్డికి వైద్య ఆరోగ్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ నుండి రూ.60వేల మంజూరైన చెక్కును క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులకు హరికృష్ణ అందజేశారు. కార్యక్రమంలో డిసిసి మహిళా జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, నాయకులు దాస అంజన్న, బంక చిరంజీవి, మల్లేశం ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలి : డిఇవో

**కొండపాక, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్రెడ్డి అన్నారు. బుధవారం దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేగా పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిదడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ది చెందాలంటే విద్యార్థుల తల్లిదండ్రుల సహాకరం అవసరమన్నారు. ప్రతి నెల పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలని సూచించారు. 6,7,8,,9 తరగతులు పూర్తిచేసి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఆయన అభినందనపత్రాలను అందించారు. పాఠశాల డయాస్ సుందరీకరణకు రూ॥ 2 లక్షలను డొనేట్ చేస్తున్న అంగ్ల ఉపాధ్యాయురాలు కిరణ్మయిని డిఈఓ అభినందించారు. సమావేశం హెచ్ఎం లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు పలువురిని అలరింపజేశాయి. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్రెడ్డి, సిఎంఓ రంగనాథ స్వామి, హస్టల్ వార్డెన్ రాజు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యాదగిరి, ఎపిసి చైర్మన్ దీప, రెండు పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఈఓ శ్రీనివాస్రెడ్డి

# భూసమస్యల పరిష్కారానికి కీలకం భూభారతి చట్టం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్రాజ్

**వెల్దుర్తి, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మాసాయిపేటలోని రైతువేదికలో బుధవారం కలెక్టర్ రాహుల్రాజ్తోపాటు తుప్రాన్ ఆర్డిఓ జయ చంద్రారెడ్డి, తహసీల్దార్ జ్యోతి రైతులకు భూభారతి చట్టంపై ఆవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి భూభారతి చట్టంపై చేసిన సందేశం రైతులకు వినిపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కరించడానికే భూ భారతి చట్టం రూపొందించారన్నారు. ఎంతోమంది మేధావులు అధికారులు భూభారతి చట్టానికి రూప కల్పన చేశారని భూ పరిపాలన వ్యవస్థ అనేక దశలో అభివృద్ధి చెందిందని గతంలో కొన్ని చట్టాలు.. సర్వేలు. పట్టాదారు పాస్ బుక్కులు. ఆర్ ఓ ఆర్ వంటి చర్యలను గుర్తు చేశారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు భూభారత చట్టం ద్వారా పరిష్కారం లభించడం జరుగుతుందన్నారు. గతంలో ధరణి ద్వారా భూ సమస్యలపై జిల్లా టాప్ 5 లో ఉండగా భూభారతి చట్టంతో ప్రక్రియ త్వరగా పూర్తవుతాయన్నారు. ధరణిలో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకునేందుకు 33 మోడల్స్ పొందు పరిచారని, ప్రస్తుతం భూభారతిలో ఆరు మోడల్స్ మాత్రమే ఉండి సులభమైన దరఖాస్తు ప్రక్రియ చేసుకోవడానికి వీలు కల్పించింది చెప్పారు. భూభారతి లో తహసీల్దార్ స్థాయి నుండి సీసీఎల్ఏ స్థాయి వరకు సమస్యను పరిష్కరించే వెసులుబాటు కల్పించడం జరుగుతుందన్నారు చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పులు సవరణలు, అవకాశం కల్పించబడినవని రిజిస్ట్రేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు భూముల విస్తీర్ణం మార్పులు చేరుకులకు అవకాశం ఉందని ఆయన రైతులకు వివరించారు. వారసత్వంగా వస్తున్న యజమానుల పేరు మార్పులు చేసుకోవచ్చని పెండింగ్లో ఉన్న సాదా బైనమా పరిష్కారం కోసం భూభారత చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని అన్నారు ఈ దరఖాస్తులపై తైసిల్దార్ 30 రోజుల్లో గా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని గడువు తర్వాత ఆటోమేటిక్గా మోటివేషన్ జరుగుతుందని ఆయన తెలిపారు మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ కార్డు సంఖ్య కేటాయిస్తారని దీని ద్వారా భూ ఆక్రమణకు అవకాశం ఉండదని అన్నారు. గ్రామస్థాయిలోని సదస్సులు నిర్వహించి భూ సమస్యలు త్వరగా పరిష్కరించడానికి అవకాశం కల్పిస్తున్నామని అన్నారు.


నీలం మధును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### -నీలం మధు

**గజ్వేల్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణానికి చెందిన గుంటుకు మహేష్ నివాసంకు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ రేవంత్రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన బాగుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశారని, తెల్ల రేషన్కార్డు లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం సాహసోపేత నిర్ణయం అన్నారు. బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన తిరిగి అర్హులైన వారికి అందేలా చూడాలన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఇల్లులేని నిరుపేదలు ఉండవద్దని, అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇప్పించేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని, కష్టపడే వారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. కాగా నీలం మధుకు గజ్వేల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గుంటుకు శ్రీనివాస్, సుఖేందర్రెడ్డి, అరుణ్కుమార్, శ్రావణ్కుమార్, దయ్యాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ చౌరస్తాలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

### ఇబ్బందుల్లో వాహనదారులు

**నర్సాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ పది రోజులుగా పనిచేయడం లేదు. దీంతో వాహనాల రాకపోకలకు ప్రయాణికులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ చౌరస్తాలోట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో నర్సాపూర్ నుండి తూప్రాన్, సంగారెడ్డి, హైదరాబాద్, మెదక్రోడ్డు మార్గాల్లో వాహనాలను తమ ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో వాహనాలు అడ్డదిడ్డంగా రావడంతో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియలేని పరిస్థితులు చోటు చేసుకున్నాయి. గతంలో చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు. కాగా గత పది రోజుల నుండి ఈ ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయడంలేదు. ఈ మేరకు ప్రమాదాల నివారణకు ఈ ట్రాఫిక్ సిగ్నల్స్ ను సంబంధిత అధికారులు బాగు చేయించాలని అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటి రైనా సంబందిత అధికారులు స్పందించి నర్సాపూర్ చౌరస్తాలో ట్రాపికన సాఇగ్నల్స్ ను బాగుచేయించాలని ప్రజలు కోరుతున్నారు.


ట్రాఫిక్ సిగ్నల్స్ లేక అడ్డదిడ్డంగా వెళుతున్న వాహనాలు


మేనేజర్కు వినతిపత్రం అందజేస్తున్న శివశంకర్ మహిళా గ్రూపు సభ్యులు

## నగదు కాజేసిన ఆర్పిపై చర్యలు తీసుకోవాలి

### -శివశంకర్ డ్వాక్రా గ్రూపు సభ్యులు

**గజ్వేల్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** పట్టణానికి చెందిన శివశంకర్ డ్వాక్రా గ్రూపు సభ్యులను మోసం చేసి రూ.20 లక్షలు కాజేసిన ఆర్పి కృష్ణలీలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం యూనియన్ బ్యాంక్ మేనేజర్కు గ్రూపు సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ పట్టణానికి చెందిన ఆర్పి కృష్ణలీల, మంజుల అనే ఇద్దరు కలిసి ఒకరికొకరు పరిచయంలేని వ్యక్తులం అయిన తమను ఫోటో స్టూడియోకు తీసుకెళ్ళి గ్రూపు ఫోటో తీయించి మీ అందరికి కలిపి రూ.20 లక్షల రుణం వస్తున్నట్లు నమ్మబలికి మా యొక్క ఆధార్ కార్డులు తీసుకొని అందరికి యూనియన్ బ్యాంకులో వ్యక్తిగత ఖాతాలు ఓపెన్ చేయడం జరిగిందని, గ్రూపు అవసరాల నిమిత్తం అంటూ ఎలాంటి తీర్మానం రాయకుండానే ఖాళీ గ్రూపు పుస్తకాలలో, ఖాళీ ఓచర్లపై అందరితో సంతకాలు చేయించుకోవడం జరిగిందని తెలిపారు. కొన్ని రోజుల తర్వాత 20 లక్షల రుణం ఏమైందంటూ ఆర్పి కృష్ణలీలను అడుగగా ఇంకా రాలేదని, బ్యాంకు సర్వర్ సమస్య ఉందని పదే పదే తెలిపిందని, మంజులను అడుగగా రుణం విషయం మరిచిపోయాని కొద్దిమందిని బెదిరించినట్లు తెలిపారు. గ్రామ సమైఖ్య సంఘం ద్వారా శ్రీనిధి రూ.40వేలు, 22వేలను కొద్ది మందికి ఇవ్వడం జరిగిందని, రెండు సంవత్సరాల కాలంలో గ్రూప్ సభ్యులను పరిచయం చేయకుండా సమావేశాలు నిర్వహించకుండా గ్రూపు సభ్యులను ఒకరినొకరు కలువనివ్వకుండా 20 లక్షల రూపాయలను కృష్ణలీల కాజేసిందని, ఆమెపై చర్యలు తీసుకోవాలని, మొత్తం డబ్బులు రికవరీ చేయాలని, అలాగే మా పేరుతో ఉన్న రుణాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా గజ్వేల్ పట్టణంలో మరో రెండు గ్రూపులు నెహ్రూ మహిళా సంఘం, సావిత్రి మహిళా సంఘం గ్రూపుల్లో సైతం రుణం తీసుకున్నట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రూపు సభ్యులు అనసూయ, బాలమణి, మౌనిక, రజన, సాహితి, స్రవంతి, శ్రీలత, స్వప్న, స్వాతి, శివాని తదితరులు ఉన్నారు.

## గొల్లపల్లిలో గ్రాడ్యుయేషన్ దినోత్సవం

**కొండాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గొల్లపల్లిలో బుధవారం అంగన్వాడి కేంద్రంలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అంగన్వాడి కేంద్రంలో విద్యను అందుకున్న విద్యార్థులను చదువుతో పాటు ఆటపాటలతో ఉత్సాహ పర్చేందుకు వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అంగన్వాడి టీచర్లు పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ అరుణ, ఆయ అనిత, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు

**కొండాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** ధరఖాస్తులు చేసుకున్న అర్హులందరికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని తహసీల్దార్ బి అశోక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాందాపూర్లో ధరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను పరిశీలించి గ్రామంలో విచారణ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి, ధరఖాస్తు దారులు పాల్గొన్నారు.


రేషన్ కార్డు దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్

# ఫాసిస్ట్ కుట్రలను సంఘటితంగా ఎదుర్కొంటాం

### రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల ఉద్ఘాటన

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** దేశంలో జరుగుతున్న ఫాసిస్టు మతోన్మాద అధిపత్య కుట్రలను సంఘటితంగా ఎదుర్కొంటామని ప్రజాసంఘాలు ముక్తకంఠంతో ప్రకటించాయి. మంగళవారం రాత్రి మెదక్ పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్లో వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ ఉల్లంఘనలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని రాజకీయ పక్షాలతో పాటు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. మెదక్ జేఏసీ కన్వీనర్ షేక్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేష్, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బీ. కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిల్ల ఆంజనేయులు, ఎంఐఎం నేత ఫసీ, బీఎస్పీ నేత సిద్ధిరాములు, ఎంఎంఏ నేత ఇష్రత్ అలీ షఫీ, సీనియర్ నేత అఫ్జల్, డాక్టర్ సూఫీ, జమాత్ ఏ ఇస్లామి హింద్ నేతలు ఫాజిల్, సీనియర్ జర్నలిస్ట్ బొందుగుల నాగరాజు, యూసీపీఏ జిల్లా అధ్యక్షుడు వినయ్, ఎంఆర్ పీఎస్ నేత బాలరాజు, ఇస్లాం మత ప్రబోధకులు ఖలీల్, అక్బర్, నసీర్, సాదతలీ, అస్గర్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా మైనార్టీలు దళితుల లక్ష్యంగా చేసుకొని ఫాసిస్ట్ మతోన్మాద శక్తులు


రౌండ్ టెబుల్ సమావేశంలో ప్రజా సంఘాలు

పేట్రేగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని రక్షించాలని ఉద్దేశంతో బుద్ధి జీవులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఏర్పడిందని సభ అభిప్రాయపడింది. ప్రతి అంశంపై సమగ్రమైన అవగాహనతో సంఘటితంగా మాట్లాడకపోతే భారతదేశం మరింత ప్రమాదంలోకి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల హక్కుల గురించి మాట్లాడే సంఘాలు బలహీనపడడం ప్రజాస్వామ్య మౌలిక స్వరూపానికి గొడ్డలిపెట్టుగా మారిందని వాపోయారు. వక్ఫ్ సవరణ ద్వారా ప్రాథమిక హక్కులను హరించే కుట్రను అర్థం చేసుకోవాలన్నారు. ఇది ఫాసిస్టు ధోరణులకు అర్థం పడుతుందన్నారు. భారత ప్రజాస్వామ్యం రాజ్యాంగ పరిరక్షణ కోసం అన్ని శక్తులు ఏకమై పనిచేయాల్సిన అనివార్యత కనిపిస్తుందని వెల్లడించారు. మెదక్ లో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిణామాలు గమనిస్తూ స్పందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ నేత మునోత్ గోపాల్, పాస్టర్ జీవరత్నం, నాయకులు జకీ, ఫాజీల్, షఫీ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు మల్లేశం. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు మల్లేశం. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కాంగ్రెస్ యువజన నాయకుడు దయాసాగర్, పాల్గొన్నారు.

## బిజెపి క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న శ్రీనివాస్

**కొమురవెల్లి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** కొమురవెల్లికి చెందిన బజరంగ్ దళ్ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఎక్కలదేవి శ్రీనివాస్ బుధవారం భారతీయ జనతా పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ ఆధ్వర్యంలో పార్టీలో క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, నాయకులు నారాయణ, నవీన్రెడ్డి, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజస్తంభ నిర్మాణానికి రూ. 2 లక్షల విరాళం


విరాళాన్ని అందజేస్తున్న దాత లక్ష్మీశంకర్ తదితరులు

**నర్సాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ నిర్మాణానికి దాత 2,25,116 రూపాయిల విరాళాన్ని ఇచ్చారు. పట్టణానికి చెందిన ఫాస్ట్ఫుడ్ సెంటర్ నిర్వాహకులు గురుస్వామి సిహెచ్.లక్ష్మీశంకర్ విరాళాన్ని ప్రకటించారు. బుధవారం శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ దుర్గప్ప గారి అశోక్గౌడ్తోపాటు ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో శ్రీఅయ్యప్ప ఆలయ ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన ధ్వజస్తంభ నిర్మాణానికి రూ. 2,25,116 ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అశోక్ గౌడ్కు అందజేశారు. ఈ సందర్భంగా వారు దాత లక్ష్మీశంకర్కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు శ్రీఅయ్యప్ప దేవాలయ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు అశోక్ గౌడ్ తెలిపారు.

## త్రిశక్తి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : నీలం మధు


నీలం మధును సన్మానిస్తున్న త్రిశక్తి ఆలయ కమిటీ సభ్యులు

**గజ్వేల్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** త్రిశక్తి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్లో నూతనంగా నిర్మించిన త్రిశక్తి ఆలయాన్ని సందర్శించారు. త్రిశక్తి ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కదుల్ల ఎల్లేశం ఆలయ ప్రాంగణంలో సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని నీలం మధు దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితోపాటు సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి త్వరలో రోడ్డు నిర్మాణం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం నీలం మధుకు అమ్మవారి జ్ఞాపికను అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సంయుక్త కార్యదర్శి ఎల్ల శ్రీనివాస్, ముఖ్య కార్యదర్శి కదుల్ల దేవేందర్, కార్యవర్గ సభ్యులు కదుల్ల వెంకటయ్య, బెదరమైన బిక్షపతి, కాటు కళ్యాణ్, జంగపల్లి మధు, కూరగాయల రాంబాబు, మహిళా సభ్యురాలు నందాసు ఇందిర, ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు జయరాములు, ఉపాధ్యక్షుడు ఎల్ల వెంకటేశం, బెదరమైన కుమార్, నరేష్, రొట్టెల రవి, కాటు శేఖర్, ఎల్ల సత్యం, రాజు, గుజ్జేటి సాయి, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తున్నాం

### -సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి

**గజ్వేల్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని, బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిలో మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దాడిచేసిన ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే జమ్మూ కాశ్మీర్ ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

### రోడ్లపై ధాన్యాం ఆరబోసి

## ఇతరుల ప్రాణాలకు హాని కలిగించవద్దు : తొగుట సిఐ లతీఫ్

**కొండపాక, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** రోడ్లపై ధాన్యాన్ని అరబోసి ఇతరులకు మృతికి కారణం కావద్దని తొగుట సిఐ లతీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోడ్లపై ధాన్యాం అరబోయడం వల్ల ద్విచక్ర వాహనదారులు, నాలుగు చక్రల వాహనదారులు అరబోసిన ధాన్యాన్ని గమనించ వాహనాలు నడిపడంతో ప్రమాదాలు జరిగి కొంత మందికి గాయలపాలవుతుండగా మరికొంత మంది చనిపోతున్నారని తెలిపారు. ధాన్యం అరబోసుకోవడానికి ఇండ్ల దగ్గర లేదా వ్యవసాయ బావుల వద్ద తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అయన రైతులకు సూచించారు. రైతులు ధాన్యం భద్రత కోసం ధాన్యంపై నల్లని కవర్లు కప్పి, దానిపై పెద్ద పెద్ద రాళ్లను పెట్టడం, బరువైన మొద్దులను పెట్టడంవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. రైతులు వారి ధాన్యం రోడ్లపై అరబోసి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని కోరారు.

## పేద ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సహాయం

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని క్యాసారం గ్రామానికి చెందిన ఆశని బాల్లక్ష్మి, బాలమల్లేశంల రెండవ కూతురు వైష్ణవి వివాహానికి బుధవారం దోస్తోంకా గ్యారేజ్ మిత్రులు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం తులసీదాస్, గుంటుకు శ్రీనివాస్, మంగళిపల్లి కిరణ్కుమార్, గంగిశెట్టి నర్సింలు, దేశబోయిని నర్సింలు, నాగరాజు, కప్ప భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న బ్యాగు బాధితులకు అందజేత

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** హుస్నాబాద్ బస్డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో మంగళవారం రాత్రి కరీంనగర్కు వెళ్లిన మహిళ తన బ్యాగును హుస్నాబాద్ బస్టాండ్లో తన బ్యాగును బస్స్టేషన్లో నిమూడవ ప్లాట్ ఫాం వద్ద మర్చిపోగా గమనించిన ఆన్డ్యూటీ కంట్రోలర్ బ్యాగును తీసుకుని సెక్యూరిటీ సిబ్బంది గదిలో భద్రపరిచారు. అయితే బ్యాగ్ పోగొట్టుకున్న మహిళా భాదితురాలు గంట తర్వాత బస్టాండ్కు వచ్చి వెతుకుతుండగా తనను పిలిచి ఆర్టీసి సెక్యూరిటీ సిబ్బంది సమక్షంలో వారికి అందజేశారు. మహిళ వొదిలిపెట్టి వెళ్లిన బ్యాగులో మూడున్నర తులాల బంగారంతో పాటు విలువైన వస్తూలు ఉన్నాయని పోగొట్టుకున్న బ్యాగును తిరిగి వారికి అప్పగించిన సిబ్బందికి మహిళ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


పోగొట్టుకున్న బంగారం బాధితులకు అందిస్తున్న కంట్రోలర్, సెక్యూరిటీ



స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ గాయత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

## గాయత్రిని సన్మానించిన ఎమ్మెల్యే

**సదాశివపేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన బొబ్బిలి గ్రామానికి చెందిన ఎ.గాయత్రిని బుధవారం ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పూలమాల, శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించి అభినందించారు. సదాశివపేట ప్రాంతానికి రాష్ట్రస్థాయిలో పేరు తెచ్చిన విద్యార్థిని గాయత్రి, గాయత్రి తల్లి దండ్రులను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో శివరాజ్ పాటిల్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, బొబ్బిలిగామ మాజీ సర్పంచ్ కుమార్, కొండాపూర్ మండల పార్టీ అధ్యక్షులు విఠల్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, విజయ్‌కుమార్, హరీష్, శ్రీధర్, నందు, శివాజీ, అనిల్‌కుమార్, కృష్ణారెడ్డి, సలువుద్దీన్ తదితరులు ఉన్నారు.

## డవ్వూర్‌లో పొలం బాట పట్టిన ప్రభుత్వ ఉపాధ్యాయులు



కూలీలకు ప్రభుత్వపాఠశాలలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**మనూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** బుధవారం మండల పరిధిలోని డవ్వూర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులు పొలం బాటపట్టారు. గ్రామ శివారులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో పనులు చేస్తున్న కూలీల వద్దకు ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి ఉపాధ్యాయులతో చేరుకుని ఉపాధి కూలీలకు ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులకు కలిగే ప్రయోజనాలపై వివరించారు. విద్యార్థులకు ఉచితంగా విద్యను అందచేయడంతో పాటు పుస్తకాలు, డ్రెస్సులు, మధ్యాహ్న భోజనం అందిస్తారని, నాణ్యమైన విద్యను అందించేందుకు అర్హత కలిగిన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారని కూలీలకు వివరించారు. చిన్నారులకు ప్రైవేటు పాఠశాలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలకే పంపాలని ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు విఠల్ రెడ్డి, సర్దార్‌లు కూలీలకు వివరించడంతో పాటు కూలీలకు మరింత అవగాహన కల్పించాలని ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్ శిరోమణికి సూచించారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్



కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్‌నగర్‌కాలనీ 7వ బ్లాక్‌లోని శ్రీపోచమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్ప నగేష్ పంచాయతీరాజ్ అధికారులతో కలిసి పరిశీలించారు. మిగిలిపోయిన పనులను(డోర్, విండోస్, గ్రిల్స్, బాల్కనీ, రేలింగ్, ఫ్యాన్లు, లైట్స్, వాష్ రూం తదితర పనులు) పూర్తి చేయాల్సి ఉందని అధికారులు కార్పొరేటర్ దృష్టికి తేగా నిర్మాణం పూర్తికి కావాల్సిన నిధులను ఎమ్మెల్యేతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని కార్పొరేటర్ అధికారులకు హామి చేశారు. నిర్మాణం పనులు పూర్తయితే ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడి కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ సురేష్, కాంట్రాక్టర్ రాజేష్, ఆలయ కమిటీ సభ్యులు, బల్ల నర్సింగ్‌రావు, కావలి నాగేష్, గడ్డం బాలయ్య, ముత్తన్న, వీరయ్య, నాగరాజు, ఎర్ర దశరథ్, పుర్ర సురేందర్, రామకృష్ణ, గడ్డం శేఖర్, గడ్డం నరేష్, చిన్న, రమేష్, హన్మంతు, గడ్డం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటలో ఎరువులు ఉంచాలి : ఏడిఎ



ఎరువుల డీలర్లతో మాట్లాడుతున్న ఏడిఎ నూతన్ కుమార్

**సిర్గాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచేలా ప్రతిపాదనలు పంపాలని ఎరువుల డీలర్లకు వ్యవసాయ సహాయ సంచాలకులు నూతన్‌కుమార్ సూచించారు. బుధవారం సిర్గాపూర్ లో ఎరువుల డీలర్లతో ప్రత్యేకంగా సమావేశమై రైతులకు ఇబ్బందులు కల్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. 0 ఫామ్స్ ఇంక్లుషన్స్ ఎప్పటికి అప్పుడు విధిగా చేసుకోవాలన్నారు. ప్రతి ఎరువుల దుకాణంలో విధిగా లైసెన్సు కాపీలను డిస్‌ప్లే చేయాలన్నారు. నకిలీ విత్తనాల కొనుగోళ్లకు సహకరించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎవో హరికృష్ణ, ఏఈఓలు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

## పహల్గామా సంఘటన హేయమైన చర్య

### -బిజెపి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

**జహీరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గావ్ లో మంగళవారం టెర్రరిస్టులు కాల్పులు జరిపి 30 మంది యాత్రికుల ప్రాణాలను బలిగొన్న సంఘటన అత్యంత హేయమైనచర్యగా మాజీ ఎంపి బిబి పాటిల్ అన్నారు. బుధవారం పట్టణంలో పహల్గావ్ సంఘటనకు వ్యతిరేకంగా బిజెపి ఆధ్వర్యంలో భవాని మందిరం నుంచి చౌరస్తా వరకు పాక్ టెర్రరిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు నిరసన ర్యాలీ నిర్వహించి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బిబి పాటిల్ మాట్లాడుతూ కాశ్మీర్‌లో పాకిస్తాన్‌కు అనకూల టెర్రరిస్టు ముఠా భారత యాత్రీకులను చంపడం 50 దేశాల ప్రజలను కలిచివేసిందన్నారు. పాకిస్తాన్ టెర్రరిస్టులకు సాయం చేస్తూ భారతదేశంలో విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండి పడ్డారు. కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇంచార్జి నౌబాద్ జగన్, నాయకులు గొల్ల భాస్కర్, విజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, రమేష్‌రెడ్డి, పూలసంతోష్, అర్చన సారడ, నరేష్‌పాటిల్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బిజెపి నాయకులు

# స్థానిక ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి

### -ఎన్‌పిఆర్‌డి జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్

**పుల్‌కల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో చత్తీస్‌గడ్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాల్లో వికలాంగులకు రిజర్వేషన్‌లు కల్పిస్తున్నట్లుగా తెలంగాణ రాష్ట్రంలో సైతం వికాలాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని ఎన్‌పిఆర్‌డి జాతీయ అధ్యక్షులు తుడుం రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో వికలాంగులకు ఇస్తామన్న హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. మే23 నుంచి 25వ తేదీ వరకు వరంగల్‌లో మూడు రోజుల పాటు రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాసభలకు భారత దేశంలోని ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. అతితీవ్రమైన వికాలాంగుల సంఘం జాతీయ అధ్యక్షులు షఫీ మాట్లాడుతూ వెన్నుముక (అతి తీవ్రమైన వికలాంగులను) ఆదుకోవాలని దేశంలో 2016లో వికలాంగుల చట్టం ప్రకారం ప్రతి జిల్లాలో త్రైకంగా సర్వేచేసి అతితీవ్రమైన వికలాంగులను గుర్తించాలని చట్టం ఘోషిస్తున్నా సంగారెడ్డి జిల్లా మినహా మిగతా జిల్లాల్లో ఆచరణలో అమలుకావడం లేదని విస్మయం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న తుడుం రాజేందర్

అతితీవ్రమైన వికాలాంగులను గుర్తించి రూ. 15 వేల ఆర్థిక ఆసరా పెన్షన్ ఇప్పించాలని, ప్రతి సంవత్సరం నెలకు రూ. 6 వేల మెడికల్ కిట్లను అందచేయాలని డిమాండ్ చేశారు. ఉత్తర భారత దేశంలో మినహా దక్షిణ భారత దేశంలో ఎక్కడ వెన్నుముక వికాలాంగులకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. ఎంపిఆర్డీ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ వికలాంగులకు 6వేల పెన్షన్ పెంచుతూ ఇందిరమ్మ ఇండ్లలో వికాలాంగులకు ప్రత్యేక కోట ఇస్తామని చెప్పినా ఇంత వరకు అమలు కావడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో వికాలాంగులకు చేసిన హామీలను వెంటనే అమలు చేయాలని, హామీలు అమలు కాకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పూనుకోవాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు.

# మే డేను జయప్రదం చేయండి

### సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్

**మెదక్ అర్బన్ ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డేను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని కేవలం కిషన్ భవన్‌లో సిఐటియు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 1886 మే 1న అమెరికా చికాగో నగరంలోని హే మార్కెట్లో శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా 8 గంటల పని దినం కోరుతూ లక్షలాది మంది కార్మికులు ప్రపంచ కార్మికులకు కార్మిక హక్కుల రక్షణకై ప్రాణాలను త్రుణప్రాయంగా అర్పించారన్నారు. ఇది మేడే అంతర్జాతీయ కార్మిక వర్గ ఐక్యతకు సంకేతమన్నారు. దీంతో పాలకవర్గం దిగివచ్చి 1890 మేము ఒకటవ తేదీన కార్మిక సంస్థ (ఏ.ఎఫ్.ఎల్) ప్రతి ఏటా మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవం జరపాలని పిలుపునిచ్చిందని గుర్తు చేశారు. 139 ఏళ్ల క్రితం కార్మికులు సాగించిన సమశీల పోరాటాల ఫలితంగానే ప్రపంచ కార్మిక వర్గానికి కొన్ని హక్కులు దక్కాయన్నారు. ప్రజల మధ్య, కార్మికుల మధ్య చీలికలు సృష్టిస్తూ కార్మికులు తమ సమస్యలకు కారణం ప్రభుత్వ విధానాల్లో ఉందని గుర్తించకుండా, వారిలో పోరాట చైతన్యాన్ని మొద్దు పరిచే ప్రయత్నం చేస్తుందన్నారు. పెట్టుబడిదారి వర్గాలను, పాలకవర్గాలను కూల్చడానికి, కార్మికులు వారి హక్కులను, చట్టాలను కాపాడుకోవడానికి 20 25 మే 20 తేదీన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని, అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే 1వ తేదీన కార్మికులు, ఉద్యోగులు ఉపాధ్యాయులు మేడేను, దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక వాడల్లో మేడే రోజున జెండాలు ఎగురవేయాలన్నారు. కార్యక్రమం లో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. మల్లికార్జున్, మెదక్ జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎ. మల్లేశం, కోశాధికారి కె.నర్సమ్మ, జిల్లా కమిటీ సభ్యులు బాలమణి, నాగరాజు, అన్నపూర్ణ,నాగేందర్‌రెడ్డి, సంతోష్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



అంగన్‌వాడీ కేంద్రం వార్షికోత్సవంలో పాల్గొన్న చిన్నారులు,తల్లులు

## వేచరేణిలో అంగన్‌వాడీ కేంద్రం వార్షికోత్సవం

**చేర్యాల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** మండలంలోని వేచరేణి అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ మాట్లాడుతూ మూడేళ్ళ నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తే వారికి పోషకాహారంతో పాటు ఆటపాటలు నేర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 25న భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

**ధూళిమిట్ట, ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** ధరణిస్థానంలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ బారతి చట్టంపై ఈనెల 25న మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దారు సింహాచలం మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యతిధులుగా జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ), ఆర్డీవో హుస్నాబాద్ పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు,అధికారులు పాల్గొని సదస్సులో రైతులకున్న సందేహాలను తెలుసుకోవాలన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన సత్తెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ చంద్రశేఖర్, డాక్టర్ శ్రీధర్ బుధవారం నాడు బాధిత కుటుంబ సభ్యులకు 8 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీమన్, నిద్రపోయిన స్వామి, శ్రీనివాస్ భాస్కర్ నాగరాజు, అనిల్, బాబు, రవి, మహేష్, సిద్ది రెడ్డి, మహేష్ రెడ్డి, శ్రీహరి, మహేష్, రాములు, రాజు, దేవరాజు, స్వామి, ఎల్లం, సత్యం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

### మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య

**నంగునూరు, ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** ఈనెల 27న వరంగల్ (ఎల్కతుర్తి) లో జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య నాయకుల, కార్యకర్తలకు సూచించారు. బుధవారం పాలమాకుల గ్రామంలో సారయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అనేక హామిలిచ్చి గద్దెనెక్కిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతు సంక్షేమాన్ని మర్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లంకి రవీందర్‌రెడ్డి,మాజీ ఎంపిటీసి శివ శంకర్ నాయకులు వెంకట్, ఐలయ్య, రవి, లక్ష్మణ్, నరేష్, కనకయ్య, మల్లేశం, వేణు, రాములు, రమేష్, రాకేష్ తదితరులున్నారు.



ఎమ్మెల్యే పల్లాతో వెంకటేష్, రాజు

## సమస్యలను పరిష్కరించాలి

**ధూళిమిట్ట, ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** ధూళిమిట్ట మండలానికి చెందిన గిరిజన బిఆర్ఎస్ నాయకులు లకావత్ వెంకటేష్, లకావత్ రాజుతో పాటు పలువురు నాయకులు బుధవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. మండలంలోని కొండాపూర్ నుండి శివాలితండా మీదుగా రామవరం వరకు బీటి రోడ్డు పనులు మొదలు పెట్టి మధ్యలోనే వదిలేశారని ఎమ్మెల్యేకు వివరించినట్లు వారు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను పూర్తి చేసేలా చూడాలన్నారు. అదే విధంగా తండాలో సీసీరోడ్లు, హైమాక్స్ లైట్స్, గృహనిర్మాణాలు మంజూరు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరలోనే పరిష్కరించే విధంగా చూస్తానని హామి ఇచ్చినట్లు తెలిపారు.

## సభ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న బిఆర్ఎస్

### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి**

బిఆర్ఎస్ సభ పేరుతో నాయకులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు అత్తు ఇమామ్ ఆరోపించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఉందని కూలీ పనులు చేసి నట్లు నటించి వ్యాపారుల నుండి బీఆర్ఎస్ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఉదయం నుండి రాత్రి వరకు కూలీ పని చేస్తే డబ్బులు వేలల్లో ఎక్కడిస్తున్నారో తెలపాలన్నారు. ఇప్పటికైన వ్యాపారస్థుల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేయడం మానుకోవాలన్నారు. లేకుంటే వ్యాపారస్థులు,ప్రజలు తగిన బుద్ది చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో యాదారి మధు,గయాజుద్దీన్ నాజ్జు, అనిల్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

# సమస్యల పరిష్కారానికి సహకరించండి : ఎమ్మెల్యే

**రామచంద్రాపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని బిహెచ్ఈఎల్ భూముల విషయంలో నెలకొన్న వివాదాలపై త్వరగా చర్యలు తీసుకుని సమస్య పరిష్కారానికి సహకరించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బుధవారం బీహెచ్ఈఎల్ ఈడి భరణిరాజుకు విజ్ఞప్తి చేశారు. బీహెచ్ఈఎల్ పరిశ్రమలోని అడ్మిన్ కార్యాలయంలో డివిజన్‌కు సంబంధించిన ప్రముఖులతో కలిసి బీహెచ్ఈఎల్ యాజమాన్యంతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈఎస్ఐ చర్చి సమీపంలో గల బీరప్పగుడిని బీహెచ్ఈఎల్ పరిశ్రమ భూమిలో ఉందంటూ అధికారులు తొలగించారని, బాంబే కాలనీ సమీపంలో ప్రహరికి ఆనుకుని గత దశాబ్దాల కాలంగా స్థానికులు పాడి రైతులు పశువుల కొటాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని కొటాలను తొలగించాలని, రాయసముద్రం చెరువు సమీపంలో గల మసీదు నిర్మాణం సైతం బేల్ పరిధిలో ఉందంటూ బేల్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే యాజమాన్యం దృష్టికి తీసుకుపోయారు. యాజమాన్యం వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతి చేశారు. కూల్చివేసిన బీరప్ప గుడిని తిరిగి అదే స్థానంలో కొత్త ఆలయాన్ని నిర్మించి విగ్రహం ఏర్పాటు చేయాలని, పాడి రైతుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాలన్నారు. ఎమ్మెల్యే సూచించిన అంశాలను సావదానంగా విని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు అధికారి హామి చేశారు. కార్యక్రమంలో రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, కురుమ సంఘం అధ్యక్షులు నరసింహ, ప్రముఖులు రెల్ల రాజు, ఐలేష్, కరిక సత్యనారాయణ, అంజన్న, యాదగిరి, గోవింద్, మల్లేష్, కుమార్, నరసింహ, లక్ష్మణ్, రవి పాల్గొన్నారు.



బిహెచ్ఈఎల్ యాజమాన్యానికి వినతి పత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## హిందువులపై కక్షతోనే పహల్గామాలో దాడులు

### -బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర సభ్యుడు అరుణ్‌రాజ్ శేరికార్

**సిర్గాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** హిందువులపై కక్షతోనే జమ్మూ కాశ్మీర్ పహల్గామాలో తీవ్ర వాదులు కాల్పులు జరిపి కాల్చి చంపారని భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా రాష్ట్ర ఈసి సభ్యులు ఆరుణ్‌రాజ్ శేరికార్ మండిపడ్డారు. బుధవారం అరుణ్‌రాజ్ శేరికార్ మాట్లాడుతూ వాక్ఫ్ బోర్డు సవరణ చేసినందుకు అయా రాజకీయ పార్టీల ముస్లింలు ప్రధాని మోదీని వ్యతిరేకిస్తూ ధర్నాలు చేస్తున్నారని, పహల్గమలో జరిగిన హిందువులను (భారతీయులను) విచక్షణ రహితంగా కాల్చి చంపిన తీవ్ర వాదులనే ఒక్క ముస్లిం విమర్శించకపోవడం విడ్డూరంగా ఉందని, ఆరుణ్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. హిందుస్థాన్‌ను కాపాడుకోవాలని, తీవ్ర వాదులను హతమర్చాలని శేరికార్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ ప్రాంతంలో రోహింగ్యాల సంచారం ఉన్నట్లు తెలుస్తోందని, వారిని గుర్తించి తరిమి కొట్టాల్సిన అవసరం ఉందని అరుణ్‌రాజ్‌శేరికార్ గుర్తు చేశారు.

## మనూర్‌లో పోషన్ పక్వాడ్

**మనూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని ఇందిరా క్రాంతి పథకం కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్ (పోషణ పక్షం) కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి తహసీల్దార్ విష్ణుసాగర్,ఎంపిడిఓ హైమద్ హుస్సేన్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జమున పాల్గొని ప్రసంగించారు. పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. పుట్టిన పిల్లలకు వెంటనే ముర్రపాలు తాపడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఖాజా మైనుద్దీన్, ఐకెపిసిబ్బంది సంగయ్య, సంజీవ్,అంగన్‌వాడిటీచర్లు పాల్గొన్నారు.

## శ్రీసీమ ఆంజనేయ ఆలయంలో కీర్తన సేవ

**సిర్గాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ మండల పరిధిలోని చాప్టా గ్రామ శివారులోని శ్రీసీమ ఆంజనేయ ఆలయంలో కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన మంగళవారం రాత్రి కీర్తన సేవ కార్యక్రమాలు నిర్వహించారు. హరిభక్త పారాయణుడు జ్ఞానేశ్వర్‌రెడ్డి వార్కారి సాంప్రదాయ పద్ధతిన కీర్తన సేవా కొనసాగించారు. చెడు వ్యసనాలు వీడి భక్తి మార్గంలో పయనించాలని భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమాలు నిర్వహించిన జ్ఞానేశ్వర్‌రెడ్డిని నిర్వాహకులు సత్కరించారు.

## ఏశప్పకు కన్నీటి వీడ్కోలు పలికిన చంద్రశేఖర్‌రెడ్డి

**కంగ్టి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎన్కెమూరి గ్రామానికి చెందిన డీలర్ యేశప్ప మరణించినట్లు తెలుసుకున్న డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఎన్కెమూరి గ్రామానికి చేరుకుని యేశప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి యేశప్ప పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. చంద్రశేఖర్‌రెడ్డిలో పాటు నాయకులు రాజ్‌పాటిల్, వెంకట్‌రెడ్డి, లాలూ, రాము, జూపాల్ నాయక్, అర్జున్ పాల్గొన్నారు.

## అల్లాదుర్గంలో 81 శాతం ఉత్తీర్ణత

**అల్లాదుర్గం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో 81 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాలనతుకారం, అధ్యాపకులు నరసింహారెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 81 శాతం, మొదటి సంవత్సరంలో 50 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో వైకీర్తన 938 మార్కులు, అనూష 885 మార్కులు, బైసిసిలో అరుణ 924 మార్కులు, పూజ 903 మార్కులు, సిఈసిలో స్వాతిక మొదటి ర్యాంకు సాధించనట్లు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో ఎంపిసిలో రంశ 412 మార్కులు, పూజిత 410 మార్కులు, బైపిసిలో సౌమ్య 399 మార్కులు, కంచరి సాహితి 388 మార్కులు వివరించారు.

## ర్యాంకర్ సరయను సన్మానించిన మహ్మద్ తన్వీర్



ఇంటర్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన సరయును సన్మానిస్తున్న మాజీ చైర్మన్ తన్వీర్

**జహీరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** క్రమశిక్షణతో విద్యను అందుకుని పరీక్షలు రాస్తే రాణించడం తధ్యమని టిజిఐడిసి మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ అన్నారు. పట్టణంలోని ఆర్ఎల్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థిని బిజీ సరయు బైపిసి మొదటి సంవత్సం పరీక్షల్లో 440 మార్కులకు గాను 436మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకును సాధించినట్లు తెలుసుకున్న మహ్మద్ తన్వీర్ బుధవారం విద్యార్థిని శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మంకాల్ సుభాష్ గుప్తా, నాయకులు రంజోల్ వైజనాథ్, శ్రీకాంత్‌రెడ్డి, మహమ్మద్ కుతుబుద్దీన్, మహమ్మద్ జహంగీర్, రంగా అరుణ్‌కుమార్, మహమ్మద్ తాజుద్దీన్, బిజీ సందీప్, బాల్‌రెడ్డి, నిజాం తదితరులు పాల్గొన్నారు.

## కవలంపేటను సందర్శించిన డిపిఓ

**కంది, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కవలంపేటను బుధవారం జిల్లా పంచాయితీ అధికారి సాయిబాబా సందర్శించారు. గ్రామంలోని పంచాయితీ కార్యాలయాన్ని సందర్శించి బాధ్యులకు డిపిఓ సాయిబాబా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిఎల్‌పిఓ అనిత ఎంపిఓ మహీందర్‌రెడ్డి, శేఖర్ తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : మాజీ ఎమ్మెల్యే

**పాపన్నపేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా వ్యాప్తంగా 80 శాతం వరికోతలు అయిపోయినందున ఆయా గ్రామాల్లో వెంటనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని మెదక్ మాజీఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం యూసుఫ్‌పేటలో శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ, మండల స్థాయి అధికారులు ప్రతి గ్రామాన్ని సందర్శించి ఐకెపి, పిఏసిఎస్‌ల ద్వార కేంద్రాల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. జిల్లా కలెక్టర్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని శశిధర్‌రెడ్డి సూచించారు.

## విలియం షేక్స్పియర్ జయంతి వేడుకలు

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** ప్రముఖ ఆంగ్ల భాష సాహితీవేత్త విలియం షేక్స్పియర్ జయంతి వేడుకలు కళాశాల ఆంగ్ల భాష విభాగం ఆధ్వర్యంలో నిర్వహించినట్టు ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఆంగ్లభాషా సాహిత్యంలో షేక్స్పియర్ చేసిన సాహిత్య ప్రయోగాలను కొనియాడారు. ఆంగ్ల భాష శాఖాధిపతి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ షేక్స్పియర్ కవితల ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కిరణ్ కుమార్ , నాగరాజు, సంధ్య శ్రీ, దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి : ఎమ్మెల్యే

**మనూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని శెల్గిరలోని ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని సౌకర్యాలను విద్యార్థులు ఉచితంగా అందుకుంటారని, నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుకోగలగుతారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటును తలదన్నేలా వార్షికోత్సవాన్ని నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు రాజన్‌కుమార్‌ను, ఉపాధ్యాయులను, సిబ్బందిని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజశేఖర్‌శెట్కార్, మాజీ జడ్పీటిసి నిరంజన్, మాజీ ఎంపిటిసి పురంజన్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు బి నాగమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



బడిబాట వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి